క్లుప్తంగా

శబరి శ్రీరామక్షేత్రంలో పూజలు



నెల్లూరు(మినీబైపాస్): హనుమజ్జయంతిని పురస్కరించుకొని నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. లక్ష మల్లెలతో సామూహిక అర్చనను జరిపారు. చిన్న పిల్లలకు వెండి డాలర్లను సాయంత్రం పంపిణీ చేశారు. స్వామివారు ఒంటె వాహనంపై విహరించారు. వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో మజ్జిగ చలివేంద్రాన్ని సేవా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు రాజేష్, లవకుమార్, మహేష్, రమేష్, సందీప్, రవి, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

వేదాయపాళెం రైల్వేస్టేషన్లో తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ చర్యల్లో భాగంగా వేదాయపాళెం రైల్వేస్టేషన్లో విస్తృత తనిఖీలను నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రాత్రి వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గస్తీని ఏర్పాటు చేశారు. ఫిన్స్ పరికరం ద్వారా అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి డేటా బేస్ సర్వర్లోని వివరాలతో పోల్చి చూశారు. భద్రతపరంగా చేపట్టాల్సిన చర్యలపై స్టేషన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడారు. స్టేషన్లో భద్రతను కట్టుదిట్టం చేశామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగింత

నెల్లూరు(క్రైమ్): రైల్వేస్టేషన్లో పోగొట్టుకున్న బ్యాగ్ను బాధితుడికి నవాబుపేట పోలీసులు అప్పగించారు. వివరాలు.. తిరుపతికి చెందిన కమలాకర్ విశాఖపట్నం నుంచి సత్రాగంజ్ ఎక్స్ప్రెస్లో ఆదివారం తెల్లవారుజామున నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లో దిగారు. అక్కడి నుంచి తిరుపతికి కారు మాట్లాడుకొని వెళ్లిపోయారు. ఈ క్రమంలో నగలు, మందులు, విలువైన వస్తువులు కలిగిన బ్యాగ్ను రైల్వేస్టేషన్లో మర్చిపోయారు. రాత్రి గస్తీలో ఉన్న నవాబుపేట పోలీసులు బ్యాగ్ను గుర్తించి స్వాధీనం చేసుకొని ఇన్స్పెక్టర్ సుబ్బారావుకు అందజేశారు. విచారణ జరిపి బ్యాగ్ను పోగొట్టుకున్న వ్యక్తికి సమాచారం అందించారు. ఈ క్రమంలో బ్యాగ్ను బాధితుడికి స్టేషన్లో అప్పగించారు.

ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గ సమావేశం



నెల్లూరు(పొగతోట): ప్రభుత్వోద్యోగుల సమస్యల సాధన కోసం దశలవారీగా ఉద్యమ కార్యాచరణను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) రాష్ట్ర సలహా మండలి చైర్మన్ రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్లో ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నారాయణ'లో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(అర్బన్): నగరంలోని తమ ఆస్పత్రిలో ప్రత్యేక థైరాయిడ్, బ్రెస్ట్ క్లినిక్ను నెల పాటు నిర్వహించనున్నామని నారాయణ సూపర్స్పెషాల్టీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్లను ఆస్పత్రిలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రత్యేక వైద్య శిబిరాలను సోమవారం నుంచి జూన్ 14 వరకు నిర్వహించనున్నామని తెలిపారు. థైరాయిడ్ సమస్యతో బాధపడే వారికి ఉచిత కన్సల్టేషన్తో పాటు రూ.2500 విలువజేసే పరీక్షలు.. రొమ్ము సమస్యలతో బాధపడే వారికి ఉచిత కన్సల్టేషన్తో పాటు రూ.1500 విలువ గల పరీక్షలను ఉచితంగా చేయనున్నామని వివరించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తామన్నారు. వివరాలకు 96401 00555, 73311 70063 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా హనుమజ్జయంతి

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి, ప్రభగిరిపట్నం, కనుపర్తి, మొగళ్లూరు, మహ్మదాపురం, కొత్తకంభాలపల్లి, శాంతినగర్, పొదలకూరులోని ఆంజనేయస్వామి మందిరాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పొదలకూరులోని మారుతీ నగర్లోని పురాతన వీరాంజనేయస్వామి దేవస్థానంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ప్రభగిరిపట్నంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సామూహిక హనుమాన్చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పూలంగిసేవ, పల్లకిసేవ నిర్వహించారు.

ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. పవన సుతుడు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇందుకూరుపేట: మైపాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకలు, పూజలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదాతలుగా దువ్వూరు సుబ్బారెడ్డి, కౌశల్యమ్మ దంపతులు వ్యవహరించారు. ఇందుకూరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు ఉదయగిరి వెంకట శేషాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. హనుమత్ గాయత్రి హోమం చేశారు.

కొడవలూరు: మండలంలోని పద్మనాభసత్రం, కొడవలూరు దళితవాడ, పాతవంగల్లులోని ఆంజనేయ స్వామి మందిరాల్లో హనుహనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మనాభసత్రంలోని కార్యసిద్ధి వినాయక జ్ఞానసరస్వతి సహిత వీరాంజనేయస్వామి ఆలయంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గణపతి, హనుమాన్, సరస్వతి శ్రీరామ మూలమంత్రం, నవగ్రహ మహాలక్ష్మి హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. :



పొదలకూరు: మొగళ్లూరులో అభయాంజనేయుడ్ని దర్శించుకుంటున్న భక్తులు

అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లీదళ అర్చన నిర్వహించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కరకంబాక రామయ్య, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. -కొడవలూరు దళితవాడలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లీ దళ అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు రాధాకృష్ణ, కోవూరు వెంకీ, కాకాని మురళి, చింతాటి రవి, గాలి ప్రసాద్, నక్కా రాజేంద్ర, ఎం హరికృష్ణ, కిరణ్ పాల్గొన్నారు. -పాతవంగల్లులో అభయాంజనేయస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెం: పెనుబల్లిలోని ఆంజనేయ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తగా వేటూరు వెంకటశేషారెడ్డి వ్యవహరించారు.



ముత్తుకూరులోని విశేషాలంకరణలో వీరాంజనేయస్వామి



ప్రభగిరిపట్నంలో విశేషాలంకరణ



ఇందుకూరుపేటలో విశేష హోమాలు



కొడవలూరు: పద్మనాభసత్రంలో..



బుచ్చిరెడ్డిపాళెం: పెనుబల్లిలో..

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు సుదర్శన నారసింహ మేష్టి హోమం నిర్వహించారు. అనంతరం 9 గంటలకు శ్రీవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు హనుమంత సేవ నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా చంద్రప్రభ వాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు దేవస్థానం నిర్వాహకులు అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, ఎస్ మురళి, డీ ప్రసాద్, సీహెచ్ వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు గరుడ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి సోమవారం ఉదయం గజ, హంస వాహన సేవలను నిర్వహించనున్నారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు దేవస్థానం కమిటీ పేర్కొంది.

విశ్వకర్మల సంక్షేమమే లక్ష్యం

మనుబోలు: విశ్వకర్మల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ పేర్కొన్నారు. మనుబోలులోని విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. పంచవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి కులాలకు అతీతంగా పనిచేస్తామని పేర్కొన్నారు. విశ్వకర్మల సంక్షేమానికి సర్వేపల్లి నియోజవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం విశ్వకర్మ పరిషత్ పరిషత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాముఆచారి, ప్రధాన కార్యదర్శిగా జగదీష్బాబు, కార్యదర్శిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కృష్ణమాచారి, కోశాధికారిగా చైతన్య, తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న శాంతికుమార్

వైష్ణవిని ఆదర్శంగా తీసుకోవాలి

పొదలకూరు : ప్రభుత్వ పాఠశాలలో చదివి పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 592 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో ఆరో స్థానంలో నిలిచిన పొదలకూరుకు చెందిన అచ్చి వైష్ణవిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన బీసీ సంక్షేమ సంఘ నాయకులతో పట్టణంలోని తొగటవీధిలో నివాసం ఉంటున్న వైష్ణవి ఇంటికి వెళ్లారు. రూ.5,016 నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైష్ణవికి బీసీ సంక్షేమ సంఘం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిన వైష్ణవి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ నాయకులు తుమ్మల శ్రీనివాసులు, పముజుల శంకరయ్య, తుమ్మల ప్రసాద్, పద్మాల వేమయ్య, లక్ష్మయ్య, చొప్పా వెంకటేశ్వర్లు, మాడా రాధాకృష్ణ, పీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



వైష్ణవికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న వూకోటి

వైఎస్సార్సీపీలో 26 కుటుంబాల చేరిక



కాకాణి సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరిన గిరిజన, దళిత కుటుంబాలు

మనుబోలు: స్థానిక చంద్రమౌళీనగర్, సంజీవయ్య కాలనీలకు చెందిన 26 గిరిజన, దళిత కుటుంబాలు టీడీపీని వీడి వైయస్సార్సీపీలో చేరాయి. శనివారం రాత్రి నెల్లూరులోని నివాసంలో మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపీ కండువాలు వేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలన బాగుండడం, మంత్రి కాకాణి సర్వేపల్లి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్న తాము ఆ పార్టీని వీడి వైఎస్సార్సీపీలో చేరినట్లు వారు తెలిపారు. తొలుత వైఎస్సార్సీపీ నాయకులు దాసరి మహేంద్రవర్మ, కడివేటి చంద్రశేఖర్రెడ్డి, దువ్వూరు సుధాకర్రెడ్డి గిరిజన, సంజీవయ్య కాలనీల్లో పర్యటించి గిరిజనులు, దళితులను కలిసి వారి సంక్షేమానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. వారికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతో 15 గిరిజన కుటుంబాలు, 11 దళిత కుటుంబాలు కలిసి కాకాణి సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరాయి. వారి వెంట పార్టీ నాయకులు చిట్టమూరు అజయ్రెడ్డి, గిద్దంటి రమణయ్య, దాసరి భాస్కర్గౌడ్, తదితరులు ఉన్నారు.

1,728 కుటుంబాలకు మత్స్యకార భరోసా

ముత్తుకూరు: ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లోని 1,728 మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద పరిహారం అందజేయనున్నట్లు మత్స్యశాఖ అధికారులు ఆదివారం తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబానికి రూ.10వేలు పరిహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ముత్తుకూరు మండలం నేలటూరు పంచాయతీలో 456, ముత్తుకూరు పంచాయతీలో 410, దొరువులపాళెం పంచాయతీలో 167, కృష్ణపట్నం పంచాయతీలో 262 కుటుంబాలకు మత్స్యకార భరోసా అందజేయనున్నారు. తోటపల్లిగూడూరు మండలం ఈదూరు పంచాయతీలో 57, కోడూరు పంచాయతీలో 414, వెంకనపాళెం పంచాయతీలో 162 కుటుంబాలకు మత్స్యకార భరోసా అందజేయనున్నారు. ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మత్స్యకార కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారని అధికారులు తెలిపారు.



తీరంలో విశ్రాంతి తీసుకుంటున్న పడవలు

వేసవి శిబిరంతో విజ్ఞానం పెంపు

కొడవలూరు: చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని కొడవలూరు లైబ్రేరియన్ కే రాజేశ్వరి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో బొమ్మలు తయారు చేయడం, గీయడం, కథలు చెప్పించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నారులు ఆటాపాటలతో విజ్ఞానం పెంపొందించుకునేలా ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు.



ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: రేబాలలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన హేమలతారెడ్డి న్యూరో స్పెషాలిటీ సెంటర్ వైద్యురాలు హేమలతారెడ్డి నరాల వ్యాధులతో బాధపడుతున్న వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మూర్ఛ, పక్షవాతం, తదితర, నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు.



చాముండేశ్వరిదేవి సేవలో కార్పొరేషన్ల చైర్మన్లు



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి అమ్మవారిని ముదిరాజ్, వడ్డీల కార్పొరేషన్ల చైర్మన్లు కొర్నా వెంకట నారాయణరావు, సైదు గాయత్రి సంతోషి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. బీసీ ఉపకులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. అందుకు జగన్మోహన్రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి వెంకటాచలంలో సోమవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదలకూరు : మండలంలోని అల్లూర్తి, మర్రిపల్లి గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్కుమారి ఆదివారం తెలిపారు. తొలుత కనుపర్తి సచివాలయం పరిధిలోని అల్లూర్తి, ఆ తర్వాత ఇనుకుర్తి సచివాలయం పరిధిలోని మర్రిపల్లి గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారని చెప్పారు. మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

చిన్నారులకు ఉచిత ఖత్నాలు



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని మదర్సా-ఏ-బీర్హాలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత ఖత్నాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం ఖలీల్ మాట్లాడుతూ తమ కమిటీ ద్వారా ప్రతి సంవత్సరం పేద పిల్లలకు ఉచితంగా ఖత్నాలు చేయిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు యూసఫ్సాహెబ్, డాక్టర్ యూసఫ్ సాహెబ్, షేక్ షాకీర్ సయ్యద్, రఫీ సయ్యద్, ఖాసీం పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్

బుచ్చిరెడ్డిపాళెం: అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ వినయ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు ముందుగానే అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఆయా విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు లేకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

హైఓల్టేజ్తో దెబ్బతిన్న విద్యుత్ ఉపకరణాలు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్నగర్లో ఆదివారం మధ్యాహ్నం హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో పలువురి గృహాల్లోని విద్యుత్ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాత విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ను మార్చాలని కోరారు.

ఘనంగా మదర్స్ డే

నెల్లూరు(మినీబైపాస్): ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మన హాస్పిటల్లో మదర్స్ డే వేడుకలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మపై సినీ గీతాలాపనలు చేశారు. అనంతరం గాయకులను సత్కరించారు. గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు గాంధీ నాగరాజన్, న్యాయవాది వెంకట రమణ, మన హాస్పిటల్ అధినేత సుధాకర్, విన్నీ జ్యూట్ ఎంపోరియం అధినేత్రి షీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వేదాయపాళెం): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువుర్ని ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులను తల్లులుగా చూసుకుంటున్న సరళ, గీతామయి బాలభవన్లో అనాథ పిల్లలను తమ బిడ్డలుగా చూస్తున్న అపర్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, వృద్ధాశ్రమ నిర్వాహకుడు పాండు, సభ్యులు లలిత, భార్గవి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



గీతామయిలో...